

# బంగారు బాల్యం

– ముగ్గెన గంగాధర రావు

నెత్తిమీద పిడుగుల వర్షం!

కాదు. మరోసారి హీరోషిమాపై బాంబుల వర్షం కురిసినట్టయింది. చాలా సేపటి వరకూ సూరిశాస్త్రి ఆ షాక్ నుండి తేరుకోలేక పోయాడు. అలా ఆలోచిస్తూనే వుండి పోయాడు.

యూనివర్శిటీ ఫస్ట్‌లోనేగాక మేథ్స్, సైన్స్‌లలో స్టేట్ ఫస్ట్ సంపాదించిన మెరిట్ స్టూడెంట్ తన జ్యేష్టపుత్రుడు. విదేశీ ఫెలోషిప్‌లతో వెళ్ళడానికి తన స్థాయి ఐ.ఎ.ఎస్. కావడం కూడా కల్సివచ్చి పనులు చకచకా జరిగిపోతూంటే...

ఇప్పుడేం జరిగిందని

ఇలా ఈ దేశంలో

ఎప్పుడయినా

ఎవరి విషయంలోనైనా జరిగిందా?...

లేదు... లేదు

మరి తనకే ఎందుకిలా జరిగింది. పదే పదే మననం చేసుకోలేక ప్రశ్నించాడు కొడుకుని.

"ఎందుకు ఇక చదవనంటున్నావ్" అన్నాడు అతి కష్టంగా.

"ఏమో... ఇక చదవబుద్ధి కావడం లేదు" నిర్లిప్తంగా వచ్చింది జవాబు.

"అలాగా... పోనీ ఇక ఏదో ఒక ఉద్యోగంలో ప్రవేశించాలని వుందా? అదెంత పని. నా పలుకుబడీ వుంది. నీ మెరిటూ వుంది. అదేం కష్టం కాదు. ఆ వెనుకే పెళ్ళి చేసుకొందువుగాని" అన్నాడు సూరిశాస్త్రి.

"పోనీ ఎవర్నయినా ప్రేమిస్తే చెప్పు. నాకేం అభ్యంతరం లేదు. కుల మతాల్తో నాకు పనిలేదని నీకు తెల్సుగా"

"నో...నో... డాడీ... అదేం కాదు. మీరు నాకిచ్చిన ఫ్రీడంరీత్యా ఆ ప్రశ్నకి తావేలేదు. కానీ..."

"ఊ...కానీ?... ఏదైనా వుంటే చెప్పు...ఎనీ ప్రోబ్లమ్"

"నో...నో డాడీ. అయామ్ ఆల్‌రైట్! ఇక దీని గురించి మీరు పెద్దగా ఆలోచించొద్దు. ఇందులో చెప్పరాని రహస్యమేం లేదు. కాని ఎందుకు. ఇక చదువుపైగాని ... మీరన్నట్టు ఉద్యోగంగాని పెళ్ళి విషయాలుగాని ఏవీ ... ఏవీ కాదు. నాకేమిటో అంతా శూన్యంగా కన్పిస్తోంది. జీవితమంతా నిర్లిప్తంగా ... నిస్తేజంగా అన్పిస్తోంది" అని గిరుక్కున వెళ్ళిపోయాడు కొడుకు శివరామ్.

కొడుకు విదేశీ చదువుల గురించి ... అందరూ ప్రశ్నిస్తుంటే ఒకవైపు బాధ ... మరోవైపు కోపం రగులుతోంది సూరి శాస్త్రిలో. ఎలా ఏం చెప్పాలో అర్థం గావడం లేదు.

శివ ఎందుకిలా మారిపోయాడో అర్థంగాక తల బద్దలయిపోతోంది. తన బాధ ఎవరితో ఎలా చెప్పుకోవాలో అర్థం గావడం లేదు. తీరని వెత రగిలిస్తోంది. ఎన్నెన్నో ఊహలు. అందమైన అంతస్తులు ఎవరో డైనమైట్లతో కూలగొట్టినట్టయి పోయింది. అయినా కొడుకుపైన ఒత్తిడి తేలేదు. శివరామ్‌ని నిశితంగాపరిశీలిస్తున్నాడు.

రోజూ వాళ్ళనాన్నమ్మ ఒడిలో తలపెట్టి ఆమె చెప్పే కథలు వింటున్నాడు. ఒక రోజది చూసి విస్తుపోయాడు. తిండికి రమ్మన్నా, తమతో పాటు పిక్చర్‌కి రమ్మన్నా టైం లేదంటూ విరచుకుపడే ఆనాటి కొడుకేనా అని విస్తుపోయాడు.

ఒక్కోరోజు చిన్న పిల్లల్ని తీసుకొని నదీ తీరంలో ఆటలు. ఒకటే పాటలు. ఎవరయినా చూస్తే ... ఏమిటది పిచ్చిగాని పట్టలేదు కదా! భయం వేసింది.

మానసిక వైద్యుని వద్దకి తీసుకెళ్తేనో...

ప్రయత్నించాడు. అది కుదర్లేదు. ఇక ఒత్తిడి చేస్తే అందరూ పిచ్చివాడనుకొంటారేమో. అనుకుంటే అనుకొన్నార్లే అని ప్రయత్నిస్తే నలుగురి నోట్లో పడి మంచివాడు కాస్తా పిచ్చివాడవుతాడేమో?!

సూరిశాస్త్రికి లోకమంతా తల్లక్రిందులుగా కన్పిస్తోంది.

ఇక ఉండబట్టలేక రాజధానిలో మానసిక వైద్యునితో సంప్రదిస్తేనో అన్న ఆలోచన కల్గింది. అబ్బాయిని తీసుకెళ్ళకుండా పరిస్థితులు చెప్పడంలో తప్పేముందన్పించింది.

ఒకరోజు వెళ్ళాడు. పరిస్థంతా వివరించాడు. డాక్టర్ ప్రకాష్ ఆశ్చర్యపోలేదు. కథాంతా విని తాపీగా అన్నాడు. ఇంటికి వస్తానని. తనను పాత మిత్రునిగానే ఇంట్లో పరిచయం చేయమన్నాడు. ఎవ్వరికీ తాను డాక్టర్‌గా తెలియనీయవద్దన్నాడు. ఏదో పని మీద వచ్చి పది రోజులుంటానని చెప్పమన్నాడు.

ఏర్పాట్లన్నీ జరిగాక. ఒకరోజు డాక్టర్ ప్రకాష్ ఐ.ఎ.ఎస్. సూరి శాస్త్రి ఇంట దిగారు.

తొందరలోనే ఇంట్లో మిత్రునిగా కల్సిపోవడమే గాక శివరామ్‌తో బాతాఖానీలు, ఊరి చివర షికార్లు, నదీ తీరంలో ఇసుకలో పిల్లల్తో ఆటలు, కమ్మని కథలు చెప్పుకోవడాలు... ఎన్నెన్నో.

డాక్టర్ ప్రకాష్, శివరాప్ ఎంతో సన్నిహితులయి పోయారు. ఒకరినొకరు అర్థం చేసుకున్నారు. ఒకరోజు డాక్టర్ ప్రకాష్ తన పని పరిపూర్ణంగా విజయవంత మయిందని చెప్పి శలవు తీసుకున్నారు.

శివరాప్ దేశమంతా పర్యటిస్తున్నాడు. యూనివర్సిటీలు దూరంగా వెదరగొడ్తున్నా కొన్ని ఆహ్వానించక పోలేదు. ముఖ్యంగా మేధావులు, విద్యార్థులు బల వంతంగా మీటింగ్‌లు పెట్టిస్తున్నాయ్.

అతని భావాలు, ఉద్యమం కొత్తగా వుంది. ఏదో తెలియని భారంలో తామింత కాలం మునిగి వున్నట్టు భావిస్తున్నారంతా. ఎన్నెన్నో ఉద్యమాల్ని ఈ ప్రపంచం చూసినా ఈ తరహా ఉద్యమం ఇదే ప్రథమం. అమూ హ్యంగా వుంది. వివిధ భాషల్లో... వివిధ దేశాల పత్రికలు ప్రత్యేకించి అతని ఉద్యమం ఆశయాలకి ప్రత్యేక కాలం కేటాయించి అతని ప్రశ్నలకి మేధావుల్ని జవాబీయమంటుంటే లోకం విస్తుపోయింది. అతనితో పాటు ఉద్యమం, అనుచరులు ప్రపంచమంతా అల్లుకు పోయింది.

అంతవరకూ పిచ్చివానిగా జమకట్టిన సూరిశాస్త్రి ఆ రోజు ఇంగ్లీషు పత్రికలో కొడుకు ఉపన్యాసం చదివాడు ఆసక్తిగా.

''జపాన్‌లో విద్యార్థులెందుకు ఆత్మహత్యలు చేసు కోవాలి. అలాగే ఇతర దేశాల్లోనూ ... చిన్నవయస్సుల్లో వాళ్ళకి మించిన బరువులు - బాధ్యతలు - వేష భాషలు టార్గెట్లు. ప్రక్కవాడితో నిరంతరపోటీ ... అతి మేధావితో అందర్ని కలిపి పరుగెట్టమనడం వికసించే కుసుమాల్ని నియంత్రిస్తూ బాల్యంలోనే సహజమైన స్వేచ్ఛ, పెద్దల ఆప్యాయత, తల్లి నాయనమ్మల ఒడిలో కమ్మని లోకజ్ఞానంగల కథలు వినడం, నిండా మన్నులో ఆడుకోవడం, తనని తానుగా వుండనీయక పెద్దవాళ్ళ తరహాలో తీర్చిదిద్దాలని బాల్యం నుండి ఉక్కు చట్రాల్లో బంధించి అప్పుడే లోకం అర్థం చేసుకోవడానికి తడబడే ఆ చిన్నారి బుజ్జాయిల్ని అదిలించి గదమాయించి నోర్మూయించి బండెడు పుస్తకాలు భుజాన పడేసి బుర్ర నిండా ఇంటా బయటా స్కూల్లో టార్గెట్ మర మేకులు, స్క్రూలు దించి కోరుకున్న వేళ కావలసిన తిండి తినకుండా కంటి నిద్ర స్వేచ్ఛ. ఇష్టాలు లేకుండా అతని వ్యక్తిత్వాన్ని మొగ్గదశలోనే చిదిమివేసి పూర్తిస్థాయి మర యంత్రాలుగా మార్చి ఆడుకొంటున్న ఈ పెద్దలు కాదా నిజమైన పిచ్చివాళ్ళు?

ఇకవాళ్ళకి మానవ జన్మలోని రమ్యత హాయి ఎలా తెలుస్తుంది. మానవత్వం ఎలా తెలుస్తుంది. వాళ్ళు విసుగుతో, పగిలిన భగ్నహృదయరోదనల్తో సతమతమవు తుంటే ఇంట్లో టీ.వీ.లే అన్నిటికి సరని, వీధిలో క్రికెట్టే సర్వస్వమని. కాస్త ఊహ తెలిస్తే సినీ స్టార్స్ రాజకీయ ఉద్యమాలే జీవితమంటూ పోతే...

ఇక జీవితం ఎంత విషపాత్రోనని వాళ్ళు తిట్టుకొనే విసుక్కొనే మూల్గులు. ఏ తండ్రి - ఏ గురువు - ఏ సంఘ సంస్కర్త వింటున్నాడు. ప్రపంచమంతా జరుగు తున్న ఈ బాల్య మేధం ఆపండి. వాళ్ళని సేద తీర్చండి. ప్రపంచ మేధావులు, సంస్కర్తలు మతాధి పతుల్లారా మీమీ నెరియల్నుండి బయటకి వచ్చి చూడండి మీ కళ్ళెదుటే జరుగుతున్న ఈ హృదయ వేదనా హింసని.

ఆ సభలో వేలాది మంది అతని ఉపన్యాసం విని అశ్రువులు వర్షించారు. శివరాప్ వాదనని బల పరుస్తూ దేశ దేశాలంతా ఉద్యమాలు ఆయా ప్రభుత్వాల్ని ప్రణాళికావేత్తల్ని నిలదీసి ప్రశ్నిస్తున్నాయ్.

'బంగారు బాల్యం - జీవితానికి వరం సంరక్షించండి' అప్పుడు ప్రపంచం తనని తానే రక్షించుకొంటుంది. ''సేవ్ ద గోల్డెన్ ఛైల్డ్‌హుడ్'' సో ద వరల్డ్ సేవ్డ్ బై ఓన్''

ప్రపంచమంతా ఇలా ఎన్నెన్నో రీతుల్లో ఉద్యమాలు. డైలీ పేపర్ క్రింద పెట్టి సూరిశాస్త్రి అనుకొన్నాడు. గతంలోకి అవలోకిస్తూ ... ఇన్ని పుస్తకాలు ... ఇన్ని సబ్జెక్టులు ఇంత పరుగు వేగం వుంటే తన కసలు మాతృభాషయినా పూర్తిగా వచ్చి వుండేదా? అని! బాల్యంలో ప్రశాంతంగా ... వెన్నెల్లో నాయనమ్మ ఒడిలో ఎన్ని కమ్మటి కథలు... వెన్నెల్లో ఎన్ని ఆటలో ... ఏవి ఆ రోజులు నేటి బాలలకి? అయ్యో ఎందుకిలా జరిగిపోతోందీ ఘోరం. పూర్ బోయస్'' కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా అనుకొన్నాడు. నా కొడుకు భవిష్యత్తు పాడయిందని బాధపడ్డాను. లేదు అతన్ని కన్నందుకు నా జన్మ ధన్యమయింది. భగవంతుడా అలనాటి బంగారు కాలం రేపటి తరం పిల్లలకయినా ప్రసాదించు అని! ●

